క్లుప్తంగా

ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలి



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ ఆసియా

కంబదూరు: ప్రతి ఒక్కరూ ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని డాక్టర్ గౌసియా తెలిపారు. మారుమూల ప్రాంతాల్లోని నిరుపేదలకు ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం వరమని అన్నారు. మంగళవారం మండలంలోని ఒంటారెడ్డిపల్లిలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ ఆసియా 104 వాహనంలో 41 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందించారు. గర్భిణులు, బాలింత లు, వృద్ధు లు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్ష లు నిర్వహించి, ఆరోగ్య జాగ్రత్తలు తెలియజే శారు.

17 మంది ఉద్యోగాలకు ఎంపిక

కళ్యాణదుర్గం రూరల్: మండలంలోని ప్రభుత్వ పాలటెక్నిక్ కళాశాలలో మంగళవారం ఉద్యోగ మేళా నిర్వహించారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కల్పన కార్యాలయం, సీడాప్, డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్య అధికారి ఆనంద్, కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ షేక్ బాదుషా తెలిపారు. ఉద్యోగ మేళాకు 117 మంది విద్యార్థులు హాజరు కాగా, 17 మంది ఎంపికయ్యారు.

అప్రమత్తంగా ఉండాలి



ఆశా కార్యకర్తలతో మాట్లాడుతున్న డాక్టర్ ప్రవీణ్‌కుమార్

కంబదూరు: ప్రస్తుతం వాతావరణంలో వస్తున్న మార్పుల వల్ల గ్రామాల్లో అంటు వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉన్నాయని, ఇలాంటి తరుణంలో అప్రమత్తం చేయాలని వైద్యాధికారులు ప్రవీణ్‌కుమార్, ప్రసన్నకుమార్,సీడీపీఓ వనజాఅక్కమ్మ సూచించారు. మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా డాక్టర్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ ఆశా కార్యకర్తలు గర్భిణులకు అందుబాటులో ఉంటూ, వారికి సకాలంలో వైద్యసేవలు అందించాలన్నారు. స్పర్శలేని మచ్చలు ఉన్న వారిని గుర్తించి డాక్టర్ల వద్దకు తీసుకెళ్లి పరీక్షలు చేయించాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది,ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఊపందుకున్న వినాయక విగ్రహాల విక్రయాలు



అమ్మకానికి ఉంచిన వినాయక విగ్రహాలు

కూడేరు: ఈనెల 7న వినాయక చవితి పండుగ సందర్భంగా విగ్రహాల విక్రయాలు ఊపందుకున్నాయి. విగ్రహాల తయారీ వారు బొజ్జ గణపయ్య విగ్రహాలను వివిధ రకాల రూపాల్లో ఆకర్షణీయంగా తయారు చేసి అమ్మకానికి సిద్ధంగా ఉంచారు. మండల పరిధిలోని కొనుకోలుదారులు విగ్రహాల కొనుగోలుకు జిల్లా, మండల కేంద్రా లైన అనంతపురం, కూడేరు తరలి వెళ్తున్నారు. ఎంపిక చేసుకున్న విగ్రహాలకు అడ్వాన్స్ అందజేసి బుక్ చేసుకుంటున్నారు. కూడేరులో కుమ్మర రమేష్ 3 అడుగుల నుంచి 13 అడుగుల ఎత్తు వరకు విగ్రహాలను తయారు చేశాడు. 3 అడుగులవి రూ.3500 , 10 అడుగులవి రూ.15 వేలు, 13 అడుగల విగ్రహాలు రూ.20 వేలు చొప్పున ధరలు నిర్ణయించారు.

కారును ఢీకొన్న గుర్తు తెలియని వాహనం

రాయదుర్గంటౌన్: పట్టణంలోని బళ్లారి రోడ్డులో విజయలక్ష్మి క్లినిక్ వద్ద గుర్తు తెలియని వాహనం విద్యుత్ స్తంభం, కారును సోమవారం అర్ధరాత్రి ఢీకొనింది. కారు యజమాని రాజు మాట్లాడుతూ కారు ముందు భాగం కూడా దెబ్బతిన్నట్లు తెలిపారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. కాగా విద్యుత్ స్తంభంకూలడంతో రాత్రి నుంచి కాలనీలో విద్యుత్ సరఫరా అంతరాయం కలిగింది.

ఆవు ప్రాణాలు కాపాడిన పశువైద్యులు

కూడేరు: కమ్మూరుకు చెందిన కురుబ మల్లికార్జున ఆవు ఈనలేక ఇబ్బంది పడుతోందని పశు వైద్యాధికారి శ్రీనివాసులు దృష్టికి బాధిత రైతు మంగళవారం తీసుకెళ్లాడు. అనంతపురంలోని పశు వైద్యశాలలోని ప్రసూతి పవువైద్య నిపుణుడు పద్మనాభం (ఏడీ, ఏవీహెచ్ శింగనమల) దగ్గరకు అత్యవసర చికిత్స నిమిత్తం సిబ్బంది ద్వారా ఆవును తీసుకెళ్లారు. అక్కడ వైద్య నిపుణులు ప్రశాంతంగా ఈనేలా చేశారు. అయితే దూడ ఆవు కడుపులోనే చనిపోయింది. కార్యక్రమంలో ఏహెచ్‌ఏలు రామాంజనేయులు, దామోదర్ రెడ్డి, ఎర్రిస్వామి, సుబ్బరాయుడు, రాఘవ, గోపాల మిత్ర రామాంజనేయులు పాల్గొన్నారు.

ఆదాయం ఉన్నా..అభివృద్ధి శూన్యం

- కొరవడిన రంగనాథ స్వామి ఆలయ భూముల పర్యవేక్షణ
- ఏటా మాన్యం భూములు కౌలుకు వేలం
- మాయమవుతున్న కౌలు ఆదాయం
- అభివృద్ధికి నోచుకోని ఆలయం



లక్ష్మీ రంగనాథ స్వామి ఆలయం



బీడుగా మారిన మాన్యం భూమి



అర్ధంతరంగా నిలిచి పోయిన కల్యాణ మంటపం

బ్రహ్మసముద్రం : శ్రీ లక్ష్మీ రంగనాథస్వామి ఆలయానికి మాన్యం భూములున్నాయి.. ఏటా భూములు కౌలు వేలం ద్వారా ఆదాయం సమకూరుతోంది. అయితే రూ.లక్షల్లో ఆదాయం మాయమవుతోంది... అధికారుల నిర్లక్ష్యం వల్ల ఆలయాభివృద్ధి మాత్రం జరగడంలేదు. దీనికితోడు ఆలయ భూముల పర్యవేక్షణ కొరవడుతోంది. పట్టించుకునేవారులేకపోవడంతో భూములు బీళ్లగా మారుతున్నాయి. బ్రహ్మసముద్రం మండలంలోని వేపులపర్తి గ్రామంలో శ్రీలక్ష్మీ రంగనాథ స్వామి ఆలయానికి సంబంధించి సుమారు 120 ఎకరాల మాన్యం భూమి ఉండేది. ప్రస్తుతం ఈ భూమి 80 ఎకరాలకు తగ్గిపోయింది. ఈ భూమి ఒక ఎకరం విలువ రూ. 10 లక్షలకు పైమాటే పలుకుతోంది. అలాంటి ఆలయ మాన్యం భూములను దేవదాయ శాఖ అధికారులు పర్యవేక్షించాల్సి ఉండగా, వారు నిర్లక్ష్యం వహిస్తున్నారు. దీంతో మాన్యం భూములు బీళ్లగా మారి కంప చెట్లతో దర్శనమిస్తున్నాయి.

అభివృద్ధిని విస్మరించిన అధికారులు..

లక్ష్మీరంగనాథస్వామి ఆలయానికి ఏటా ఆలయ భూములను వేలం వేయగా రూ.లక్షల్లో ఆదాయం సమకూరుతుంది. అయితే అధికారుల నిర్లక్ష్యం వల్ల ఆదాయానికి గండిపడుతోంది. ప్రస్తుతం ఆలయం భూములకు సంబంధించి 12 ఎకరాలను మాత్రమే సాగు చేసుకోవడానికి కౌలుకు ఇచ్చారు. వచ్చే ఆదాయం కూడా కైంకర్యం చేస్తూ, అధికారులు అభివృద్ధిని విస్మరించారని భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆదాయం వస్తుందనగానే దేవదాయశాఖ అధికారులు వచ్చి, హడావుడి చేస్తుంటారు. ఆదాయం ఎక్కడపోతోందో చూపడంలేదని ప్రజలు అంటున్నారు. ఆలయాభివృద్ధి గురించి అడిగితే చెప్పడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆలయంలో సౌకర్యాలు కరువు..

ఏటా శ్రీరామ నవమి వేడుకల్లో భాగంగా దాదాపు 9రోజులపాటు తిరునాల నిర్వహిస్తారు. భక్తులు ఆంధ్ర , కర్ణాటక ప్రాంతాల నుంచి వేలాది సంఖ్యలో తరలివచ్చి, స్వామి తిరునాల్లో పాల్గొంటారు. రంగనాథ స్వామి ఆలయంలో ఆలయానికి వచ్చే భక్తులకు నీటి సౌకర్యం కూడా కల్పించలేదు. భక్తులకు కనీస సౌకర్యాలు కరువయ్యాయి. ఆలయ అర్చకులు పూజలకు కూడా ఇంటి నుంచి నీరు తీసుకురావాల్సి వస్తోంది. ఆలయంలో భక్తులకు మరుగుడ్లు సౌకర్యం కూడా కల్పించలేదు.

పునర్నిర్మాణానికి నోచుకోని కల్యాణ మంటపం..

ఆలయంలో దాదాపు 15 ఏళ్ల క్రితం అర్ధంతరంగా నిలిచిపోయిన లక్ష్మీ రంగనాథ స్వామి కల్యాణ మంటపం నిర్మాణాన్ని కూడా దేవదాయశాఖ అధికారులు పట్టించుకోవడంలేదు. ఇప్పటికైనా అధికారులు కల్యాణమంటపాన్ని పూర్తి చేస్తే వివాహాది శుభకార్యాలు నిర్వహించుకోవడానికి అవకాశం ఉంటుందని భక్తులు అభిప్రాయ పడుతున్నారు.ఏటా శ్రీరామ నవమి వేడుకల్లో భాగంగా 9 రోజులు పాటు నిర్వహించే బ్రహ్మోత్సవాలను (తిరునాల) కూడా దాదాల సహకారంతోనే నిర్వహిస్తున్నారు.

నిధులు పక్కదారి

ఆలయ భూములకు సంబంధించి నిధులు పక్కదారి పడుతున్నాయి . దీంతో ఆలయం అభివృద్ధికి నోచుకోవడం లేదు. లెక్కలు చెప్పాల్సిన దేవదాయశాఖ అధికారులు, మరి కొందరు తోడై, డబ్బులు మాయం చేస్తున్నారు. సంబంధిత ఉన్నతాధికారులు దృష్టి సారించి, మాన్యం భూములను పర్యవేక్షించి, ఆలయ అభివృద్ధికి సహకరించాలి.

– పాటిల్ ప్రభాకర్ రెడ్డి, వేపులపర్తి

కానుకలతోనే తిరునాల జరుగుతోంది..

ప్రతి ఏటా లక్ష్మీరంగనాథ స్వామి తిరునాలకు భక్తులు, దాతలు సమర్పించే కానుకలతో నిర్వహిస్తున్నాం. అధికారులు అంతంత మాత్రంగానే సహకరిస్తున్నారు. ఆలయాభివృద్ధిపైన అధికారులు ఏమాత్రం పట్టించుకోవడంలేదు. కొన్ని అభివృద్ధి పనులు అర్ధంతరంగా ఆగిపోయాయి.

– ఈశ్వర్, ఆలయ కమిటీ చైర్మన్, వేపులపర్తి

ఉంతకల్లును సందర్శించిన హిమాలయ యోగి



రుక్మిణీ పాండురంగ స్వామిని దర్శించుకుంటున్న యోగి సచ్చిదానంద స్వామీజీ

బొమ్మనహాళ్: మండలంలోని ఉంతకల్లులో ప్రసిద్ధి చెందిన రుక్మిణీ పాండురంగస్వామి ఆలయాన్ని హిమాలయ యోగి సచ్చిదానంద స్వామీజీ మంగళవారం సందర్శించారు. గ్రామంలోని పిరమిడ్ ధ్యాన భవన నిర్మాణ పనులను స్వామీజీతో ప్రారంభింపజేశారు. రుక్మిణీ పాండురంగ విఠల హరి నామంతో ధ్యానం చేస్తే శుభం కలుగుతుందని స్వామీజీ సూచించారు. కార్యక్రమంలో బద్దనహళ్లి నాగిరెడ్డి, ఇంజనీర్ నాగరాజు పాల్గొన్నారు.

ధూమపానంతో ఆరోగ్యానికి చేటు

కూడేరు: ధూమపానం ఆరోగ్యానికి హానికరమని మండల వైద్యాధికారి లక్ష్మీనారాయణ తెలిపారు. మంగళవారం వైద్యాధికారి లక్ష్మీనారయణ, సిబ్బంది, ఆశా వర్కర్లు దూమపానానికి వ్యతిరేకంగా కూడేరులో ర్యాలీ చేశారు. ధూమపానంతో గుండె పోటు, ఊపిరితిత్తులకు క్యాన్సర్ వస్తాయని హెచ్చరించారు. యువత ధూమపానాన్ని ఫ్యాషన్‌గా తీసుకుంటున్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు రవీంద్ర, యశోద, పార్మసిస్టు వేణుగోపాల్, ల్యాబ్ టెక్నీషియన్ వేణుగోపాల్, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన ఉండాలి



సుఖ వ్యాధులపై అవగాహన పోస్టర్లను విడుదల చేస్తున్న వైద్యాధికారులు

కళ్యాణదుర్గం రూరల్: హెచ్‌ఐవీ ఎయిడ్స్‌పై ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలని డాక్టర్ రిహా జైనబ్ తెలిపారు. మంగళవారం పట్టణంలోని ఇందిరమ్మ కాలనీలోని హెల్త్‌క్లినిక్‌లో ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, జిల్లా ఎయిడ్స్ నివారణ సంస్థ, రైడ్స్ కళ్యాణదుర్గం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో 'మీకు తెలుసా..' అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హెచ్‌ఐవీ ఎయిడ్స్ వ్యాధి ఎలా వస్తుంది, ఎలా వ్యాపించదు, హెచ్‌ఐవీ రాకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలని స్టాఫ్ నర్సులు, ఆశ వర్కర్లకు అవగాహ కల్పించారు. డాక్టర్ రిహా జైనబ్, రైడ్స్ ప్రాజెక్ట్ మేనేజర్ మహేష్ చేతుల మీదుగా హెచ్‌ఐవీ, ఎయిడ్స్ అవగాహన పోస్టర్లు విడుదల చేశారు. కార్యక్రమంలో ఐసీటీసీ కంట్రోలర్ ఈశ్వరయ్య, కళ్యాణదుర్గం రైడ్స్ సిబ్బంది పాల్గొన్నారు.

సుఖ వ్యాధులపై అవగాహన అవసరం

బెళుగుప్ప: మండల కేంద్రంలో వైద్యాధికారులు కార్తీక్‌రెడ్డి, ప్రియాంకల ఆధ్వర్యంలో సుఖవ్యాధులపై మంగళవారం అవగాహన ర్యాలీ చేశారు. ఏపీ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, జిల్లా ఎయిడ్స్ నివారణ నియంత్రణ సంస్థ, మాస్ ఎడ్యుకేషన్ సంస్థ బెళుగుప్ప సంస్థ వారితో కలసి మీకు తెలుసా? కార్యక్రమం నిర్వహించారు. 2017 చట్టం, 1097 టోల్‌ఫ్రీ నంబర్లపై ఎయిడ్స్ నివారణ కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాస్ ఎడ్యుకేషన్ ప్రాజెక్టు మేనేజర్ నీలకంఠ, అధికారులు లోకేష్, నవీన్, హెల్త్ సూపర్‌వైజర్ వెంకటరమణ, సీహెచ్ఓ సుభాన్, జీవి రాంబాబు, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

రాయితీలను సద్వినియోగం చేసుకోండి



ఒంటిమిద్ది గ్రామంలో దానిమ్మ తోటను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

కళ్యాణదుర్గం రూరల్: ఉద్యాన శాఖ అందించే రాయితీలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏపీఎంఐపీ ఏడీ రఘునాథ్‌రెడ్డి, జిల్లా ఉద్యాన అధికారి నరసింహులు తెలిపారు. మంగళవారం కళ్యాణదుర్గం మున్సిపాలిటీ పరిధిలోని ఒంటిమిద్ది, దేవాదుల కొండ గ్రామంలోని దానిమ్మ, చీనీ, మామిడి తోటలను పరిశీలించారు. అనంతరం రఘు నాథ్‌రెడ్డి, నరసింహులు మాట్లాడుతూ ఉద్యానశాఖ నుంచి రైతులకు 40శాతం నుంచి 50 శాతం రాయితీలు అందిస్తోందన్నారు. రైతులందరూ వినియోగించుకోవలన్నారు. పంటలను సాగు చేసిన రైతులు తప్పకుండా ఈనెల 15తేదీలోపు ఈక్రాప్ బుకింగ్ చేసుకోవలన్నారు. ఉద్యాన పంటలో తీసుకోవాలసిన తగు జాగ్రత్తలు, సమగ్ర సస్యరక్షణ చర్యలు చీడపీడల నివారణపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉద్యాన అధికారి కృష్ణతేజ, ఆర్ఎస్కే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రాయితీతో ప్రత్యామ్నాయ పంట విత్తనాలు

వజ్రకరూరు: 80శాతం రాయితీతో ప్రత్యామ్నాయ పంట విత్తనాలు పంపిణీ చేయనున్నట్లు మండల వ్యవసాయ అధికారి మధుకర్ తెలిపారు. మంగళవారం స్థానిక ఏఓ కార్యాయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. మండలంలో ప్రత్యామ్నాయ పంట విత్తనాలు కావాల్సిన రైతులు రైతు సేవా కేంద్రాలకు వెళ్లి రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఉలవలు, అలసందులు, పెసలు, కొర్రలు అందించనున్నట్లు తెలిపారు. రైతుసేవా కేంద్రాల్లో రైతులకు అందుబాటులో డీఏపీ, యూరియా,20.20.013 ఎరువులకు ఉంచినట్లు తెలిపారు.

పరీక్ష ప్యాడ్‌ల పంపిణీ

బొమ్మనహాళ్: మండలంలోని ఉంతకల్లు గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు జనసేన మండల నాయకులు సిఖిందర్ బాషా, ఖాదర్ బాషా పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులను మంగళవారం పంపిణీ చేశారు.

ఆముదం పంటకు తెగుళ్లు

కూడేరు: మండలంలో వర్షాధారం కింద సాగు చేసిన ఆముదం పంటకు తెగుళ్లు సోకాయి. పి.నారాయణపురం, కమ్మూరు , జయపురం, కూడేరు, చోళసముద్రం , జల్లిపల్లి, కొర్రకోడు, మరుట్ల, కరుట్లపల్లి, ముద్దలాపురం, ఇప్పేరుతో పాటు మరికొన్ని గ్రామాల్లో సుమారు 3 వేల ఎకరాల్లో ఆముదం పంట సాగు చేశారు. తుపాను ప్రభావంతో ఇటీవల కురుస్తున్న వర్షాలకు ఆముదం పంటకు ఎండు తెగులు సోకింది. నామాల పురుగు పడడంతో ఆకులన్నీ రంధ్రాలు పెడుతున్నాయి. ముందు సాగు చేసిన ప్రాంతాల్లో ఆముదం కాయ పింజను తినేస్తున్నాయి. దీంతో దిగుబడిని రైతులు కోల్పోవాల్సి వస్తుంది. ఆముదం పంటకు తెగుళ్లు సోకడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

క్లోరినేషన్ తప్పనిసరి

కూడేరు: రోజూ క్లోరినేషన్ చేసి తాగునీటిని ప్రజలకు సరఫరా చేయాలని ఈఓఆర్డీ లక్ష్మీనరసమ్మ ఆదేశించారు. మంగళవారం తన చాంబర్‌లో పంచాయతీ కార్యదర్శులతో ఆమె సమావేశమయ్యారు. అనంతరం మాట్లాడుతూ ప్రజలు రోగాల బారిన పడకుండా చర్యలు చేపట్టాలన్నారు.

ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలి



మాట్లాడుతున్న ఆర్‌డీఓ రాణి సుస్మిత, డీఎస్పీ రవిబాబు



మాట్లాడుతున్న వజ్రకరూరు ఎస్‌ఐ నరేష్



కణేకల్లులో పీస్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న సీఐ వెంకటరమణ

కళ్యాణదుర్గం రూరల్: వినాయక చవితి ఉత్సవాలు జరుపుకునేవారు ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలని ఆర్డీఓ రాణీసుస్మిత, డీఎస్పీ రవిబాబు తెలిపారు. మంగళవారం పట్టణంలోని స్థానిక ఆర్‌డీఓ కార్యాలయంలో డివిజన్ పరిధిలోని అన్ని శాఖల అధికారులు ఎస్‌ఐలు, సీఐలు, తహసీల్దార్లు, మున్సిపాల్ కమిషనర్లు, ఎంపీడీఓలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ వినాయక చవితి వేడుకల్లో ఎలాంటి గొడవలు చేసుకోకూడదన్నారు. మంటపాలను రోడ్లకు అడ్డంగా ఏర్పాటు చేయరాదన్నారు. ప్రజలకు ఇబ్బంది కలిగేలా డీజే ఏర్పాటు చేయరాదన్నారు.

వివరాలు నమోదు చేసుకోండి

వజ్రకరూరు: మండలంలోని అన్ని గ్రామాల్లో వినాయక విగ్రహాల ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని ఎస్‌ఐ నరేష్ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఆయన మాట్లాడారు. విగ్రహాల ఏర్పాటుకు (హెచ్‌టీటీపీఎస్ .జీఎఎస్‌ఈఎస్‌హెచ్‌హెచ్‌యుటీఎస్.ఏపీ.ఎన్‌ఈటీ) వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేయాలన్నారు. మండలంలోని ప్రజలు వినాయక చవితిని ప్రశాంతంగా జరుపుకోవాలన్నారు.

వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలి

కణేకల్లు: వినాయక చవితి వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలని రాయదుర్గం సీఐ వెంకటరమణ తెలిపారు. మంగళవారం స్థానిక పోలీసుస్టేషన్‌లో పీస్ కమిటీ సమావేశం జరిగింది. ఈసందర్భంగా సీఐ, ఎస్‌ఐ నాగమధులు మాట్లాడారు. వినాయక విగ్రహాల ప్రతిష్టాపనకు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలన్నారు. ప్రజల రాకపోకలకు ఇబ్బందులు కలిగిచే స్థలాలు, వివాదాస్పద స్థలాల్లో వినాయక ప్రతిమలను కొలువుదీర్చరాదన్నారు. వినాయక మంటపాల వద్ద విద్యుత్‌శాఖ అధికారుల అనుమతితో తాత్కాలికంగా విద్యుత్ కనెక్షన్ తీసుకోవాలన్నారు. మండపాల వద్ద డీజేలు ఏర్పాటు చేయరాదన్నారు. నిమజ్జనం రోజు మద్యం సేవించి కార్యక్రమాల్లో పాల్గొనరాదన్నారు. ఈకార్యక్రమంలో ఏఎస్‌ఐ ఈశ్వరయ్య, శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి

బొమ్మనహాళ్: గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని, అల్లర్లకు పాల్పడితే చర్యలు తప్పవని ఎస్‌ఐ నబీరసూల్ హెచ్చరించారు.మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో గణేష్ ఉత్సవ కమిటీ సభ్యుల సమావేశం నిర్వహించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ ఈ -పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకున్న వారికి మాత్రమే వేడుకలకు అనుమతి ఇస్తున్నట్లు తెలిపారు. డీజేలకు అనుమతి లేదని, హిజ్రాలను పిలిపించి డ్యాన్సులు చేయించినా, నిమజ్జనం సమయంలో మద్యం సేవించి అల్లర్లు చేసినా చర్యలు తప్పవని హెచ్చరించారు.

విషపురుగులతో బెంబేలు



కూడేరు: దారిలో పెరిగిన పిచ్చిమొక్కలు

కూడేరు: ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో విష పురుగులు తిరుగుతుండడంతో ప్రజలు, ఉద్యోగులు భయాందోళనకు గురవుతున్నారు. ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో వెలుగు, వ్యవసాయ, హార్టికల్చర్, ఉపాధి హామీ, హౌసింగ్, సచివాలయం-1,2 కార్యాలయాలు ఉన్నాయి. పనులు నిమిత్తం మండల పరిధి నుంచి ప్రజలు రోజూ అధిక సంఖ్యలో తరలి వస్తుంటారు. ఈ కార్యాలయాలకు వెళ్లే దారికి, కార్యాలయాల పక్కన పెద్ద ఎత్తున పిచ్చి మొక్కలు పెరిగి పోయాయి. అందులో పాములు, విష పురుగులు చేరాయి. విష పురుగులు బయట సంచరిస్తుండడంతో ప్రజలు భయంతో బెంబేలెత్తి పోతున్నారు. ఎంపీడీఓ కార్యాలయ సిబ్బందికి ఏర్పాటు చేసిన టాయిలెట్ పక్కన తరుచూ పాములు కనిపిస్తున్నాయి. మహిళా ఉద్యోగులు టాయిలెట్‌లోకి వెళ్లాలంటేనే భయపడిపోతున్నారు.

ఘనంగా మారెమ్మ జాతర



పడమటి కోడిపల్లిలో మారెమ్మ గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం



కలుగోడులో ప్రత్యేక పూజలందుకున్న మారెమ్మదేవత

గుమ్మఘట్ట: మండల వ్యాప్తంగా ఉన్న గ్రామాల్లో మారెమ్మ దేవత జాతరను ఆయా గ్రామస్తులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. వేకువజాము నుంచి అమ్మవారికి ఆలయాల్లో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేపాకు చీరలతో ఆలయం చుట్టు ప్రదక్షణలు చేసి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. ఎలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు పటిష్టమైన చర్యలు చేపట్టారు.

సెట్టూరు: మండలంలో మారెమ్మ జాతర ప్రారంభమైంది. బసంపల్లి గ్రామంలో గ్రామ దేవత మారెమ్మకు మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామస్తులు జ్యోతులు, బోనాలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి సమర్పించారు. గ్రామ దేవతను పూజించడం ద్వారా గ్రామంలో పాడి,పంటలు సమృద్ధిగా ఉంటాయని, అంటువ్యాధులు ప్రబలకుండా ఉంటాయని ఇక్కడి భక్తుల నమ్మకం.

బ్రహ్మసముద్రం: మండలంలోని పాల వెంకటాపురం, రాయలదొడ్డి, కన్నేపల్లి, పడమటి కోడి పల్లి తదితర గ్రామాల్లో మంగళవారం మారెమ్మ జాతర నిర్వహించారు. ఈ సందర్భంగా మారెమ్మ దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లో మారెమ్మ ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించిన వాహనాల్లో ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు.

వైభవంగా దుగ్గిలమ్మ జాతర



రాయదుర్గంలో ప్రత్యేక పూజలందుకున్న దుగ్గిలమ్మ మూలవిరాట్



బెళుగుప్పలో ప్రత్యేక అలంకరణలో దర్శనం ఇస్తున్న గౌరసంద్రం మారెమ్మ



రాయదుర్గంలో కిక్కిరిసిన భక్తులు



గౌరసంద్రం మారెమ్మ ప్రభ ఊరేగింపు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని 17వ వార్డులో వెలసిన దుగ్గిలమ్మ జాతర మంగళవారం వైభవంగా జరిగింది. అమ్మవారి దర్శనం, మొక్కులు తీర్చుకునేందుకు ఆలయానికి భక్తులు పోటెత్తారు. తెల్లవారు జామున 5 గంటల నుంచి సాయంత్రం వరకు భారీ సంఖ్యలో భక్తుల రద్దీ కొనసాగింది. పట్టణంతోపాటు పరిసర గ్రామాలు, సరిహద్దున ఉన్న కర్ణాటకలోని ప్రాంతాల నుంచి తరలివచ్చిన వేలాది మంది భక్తులతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది.

నేడు సిడి మాను ఉత్సవం: ఉత్సవాల్లో భాగంగా దుగ్గిలమ్మ జాతర మరుసటి రోజు బుధవారం పట్టణంలోని ఫైర్‌స్టేషన్ వద్ద నున్న కోట మారెమ్మ ఆలయం వద్ద సిడి మాను ఉత్సవం జరుగుతుంది. సాయంత్రం జరిగే ఈ ఉత్సవానికి పట్టణ ప్రజలు పెద్ద ఎత్తున తరలివస్తారు. పట్టణంలోని నేసేపేటలోని పెద్ద మారెమ్మ, దండుమారెమ్మ ఆలయాల వద్ద కూడా సిడి మాను ఉత్సవం జరుపుతారు.

వైభవంగా గౌరసంద్ర మారెమ్మ వార్షికోత్సవం

బెళుగుప్ప:మండల కేంద్రంలోని గౌరసంద్ర మారెమ్మ దేవత ఆలయ వార్షికోత్సవాన్ని భక్తులు మంగళవారం వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి కండోల స్వీకారం, పోతులింగేశ్వర ఆలయం నుంచి ఒడి బియ్యం తెచ్చే కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి ప్రభను వీధుల గుండా ఊరేగింపుగా తీసుకొచ్చారు.